నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, బుధవారం 14 మే 2025 | WARANGAL

హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, పొన్నాల లక్ష్మయ్య, శాసన మండలిలో ప్రతిపక్షనేత సిరికొండ, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి, మాజీ ఎమ్మెల్యేలు

వరంగల్ సభతో కాంగ్రెస్ అంతానికి ఆరంభం

రేవంత్ సర్కారుపై పోరాటాలకు సిద్ధం కావాలి

- కాంగ్రెస్ ద్రోహాన్ని ప్రజలకు వివరించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం
- ఉమ్మడి జిల్లా నేతలతో హైదరాబాద్‌లో సమావేశం
- ఎల్కతుర్తి సభ విజయంపై అభినందనలు

వరంగల్, మే 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ చరిత్రలోనే అత్యంత భారీ సభగా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నిలిచిపోతుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పకడ్బందీ ప్రణాళిక, క్రమశిక్షణ, ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఉన్న అంతులేని అభిమానానికి ఎల్కతుర్తి బహిరంగ సభ నిదర్శనమని చెప్పారు. ఎల్కతుర్తి సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల దిశ మారిందని స్పష్టం చేశారు. రజతోత్సవ మహాసభ విజయానికి కారణమైన ప్రతి కార్యకర్తకు, నేతకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ విజయవంతమైన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కేటీఆర్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సభ నిర్వహణలో భాగస్వాములైన నేతలతో కలిసి కేటీఆర్ భోజనం చేశారు. బీఆర్ఎస్ 25 సంవత్సరాల సంబురాన్ని వరంగల్ గడ్డపై నిర్వహించే అవకాశం ఇచ్చినందుకు వరంగల్ నేతలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అన్ని విషయాల్లో తమకు దిశానిర్దేశం చేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సభ విజయవంతంగా నిర్వహించిన అనుభవాలను పంచుకున్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు.

రజతోత్సవ సభతో అందరిలో కదనోత్సాహం

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, సతీశ్‌కుమార్

'ఇప్పుడైనా, ఎప్పుడైనా రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు బీఆర్ఎస్సే. బీఆర్ఎస్ ఎల్కతుర్తి సభ తర్వాత ప్రజల్లోనూ, కార్యకర్తల్లోనూ ఒక అనుకూల శక్తి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేసే ఉత్సాహం కలిగింది. ఏనాటికైనా తెలంగాణకు, ప్రజలకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అనే స్పష్టత ఎల్కతుర్తి సభతో మరోసారి నిరూపితమైంది' అని కేటీఆర్ అన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలో వచ్చి ప్రజలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అంతానికి ఆరంభం మొదలైందని కేటీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే ప్రజ ల్లో ఇంత వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వాన్ని తాను ఇప్పటి వరకు చూడలేదని చెప్పారు. అనుభవలేమి, మోసం, అత్యాశ, అందినకాడికి దోచుకోవడం లాంటి లక్షణాలు పుష్కలం గా ఉన్న రేవంత్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధి రెండు దశాబ్దాలు వెనక్కి పోయిందని అన్నారు. రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారంపై రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ విస్తృత పోరాటాలు చేస్తున్నదని చెప్పారు. రైతుభరోసా చెల్లింపులు సక్రమంగా జరగకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యాన్ని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా బీఆర్ఎస్ కార్యాచరణ ఉండబోతున్నదని వివరించారు. నిరుద్యోగులకు మాట ఇచ్చినట్టుగా నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో పాటు ఇటీవల వెలుగుచూసిన ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై సమగ్ర వ్యూహంతో ప్రజా ఉద్యమాలను ప్రారంభిస్తామని చెప్పారు. మోసానికి మారుపేరైన కాంగ్రెస్ నైజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలును ఎలా విస్మరించిందో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసాల్ని, అవినీతిని ప్రజల్లో బయటపెడతామన్నారు. ప్రజలను మోసం చేస్తూ, వేధిస్తుంటే ఊరుకునేది లేదని, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోరాటాలకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు. సమావేశంలో శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, డీఎస్ రెడ్యానాయక్, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ చైర్మన్లు గండ్ర జ్యోతి, సుధీర్‌కుమార్, అంగోత్ బిందు, నాగుర్ల వెంకటేశ్వర్లు, కే వాసుదేవారెడ్డి పాల్గొన్నారు.

నిబంధన ఎత్తివేయాలి

హనుమకొండ చౌరస్తా : రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీల్లో 6000 మంది కి నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రు ణాలివ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం తీరా దరఖాస్తు చేసుకున్నాక సిబిల్ స్కోర్‌కు లింక్ పెట్టడం సరైంది కాదు. సిబిల్ స్కోర్ నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలి. – *చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు*

రాజీవ్ యువ వికాసం (ఆర్‌వైవీ) దరఖాస్తుదారులకు సిబిల్ గుబులు పట్టుకుంది. ప్రభుత్వం ఈ పథకం అమలుకు క్రెడిట్ స్కోర్‌తో లింక్ పెట్టడంతో గందరగోళం నెలకొంది. అసలు రుణం వస్తుందా? లేదా? అనే అనుమానం నిరుద్యోగుల్లో వ్యక్తమవుతున్నది. గ్రేటర్ పరిధిలో 33,098 మంది వివిధ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అయితే సిబిల్ చెక్ చేసేందుకు వెంటనే ఆధార్ కార్డు సమర్పించాలంటూ ఆర్వీలు ఫోన్‌లో ఆదేశిస్తున్నారు. దీంతో అయోమయానికి గురవుతున్న లబ్ధిదారులు మెప్మా ఆఫీసుకు పరుగెత్తుతున్నారు. సిబిల్ కోసం ఇప్పటి వరకు 12 వేల దరఖాస్తులు బ్యాంకులకు చేరగా, మరో 21 వేలు పంపాల్సి ఉంది. సిబిల్ స్కోర్ వివరాలు బ్యాంకర్లు ఇచ్చిన తర్వాతే లబ్ధిదారులు ఎంపిక జరగనుంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో 10 రోజులు పట్టనుండగా, చాలా మందికి ఈ పథకం అందకుండా పోయే పరిస్థితి కనిపిస్తున్నది. - వరంగల్, మే 13



గందరగోళంగా రాజీవ్ యువ వికాసం

అయోమయంలో దరఖాస్తుదారులు

గ్రేటర్ పరిధిలో 33,098 అప్లికేషన్లు

ఆధార్‌కార్డులు సమర్పించాలంటూ ఆర్వీల ఆదేశాలు

సిబిల్.. గుబుల్

రాజీవ్ యువ వికాసం (ఆర్‌వైవీ)తో చిరు వ్యాపారాలు చేసుకొని జీవితంలో స్థిరపడాలనుకున్న అనేక మంది నిరుద్యోగులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చాలా మంది జీరో అకౌంట్ తీసుకోవడంతో పెద్దగా లావాదేవీలు జరగలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌వైవీ పథకానికి సిబిల్ స్కోర్‌తో లింక్ పెట్టడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. తమ ఖాతా నుంచి ఆర్థిక లావాదేవీలు జరగకపోవడంతో సిబిల్ ఎలా ఉంటుందని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. చాలా మంది ఈ పథకం కోసమే కొత్తగా బ్యాంక్ ఖాతాలు తీసుకున్నారు. ప్రభుత్వ ప్రస్తుత చర్యలతో ఈ పథకంపై ఆశలు వదులుకోవాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 50 నుంచి 60 శాతం మంది సిబిల్ లేక ఈ పథకానికి అనర్హులవుతారని ఒక అధికారి తెలిపారు.

బ్యాంకులకు దరఖాస్తులు

సిబిల్ చెక్ చేసేందుకు గ్రేటర్ పరిధిలో 12 వేల దరఖాస్తులను అధికారులు బ్యాంకులను పంపించారు. ఇది బ్యాంకర్లకు తలనొప్పిగా మారడంతో పాటు ఖాతాదారుడికి రూ. 250 వరకు చార్జీ పడుతున్నది. చాలా మంది ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో బ్యాంకర్లు చెక్ చేయకుండా వదిలేస్తున్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగా, ఇంకా 21,098 దరఖాస్తులు బ్యాంకర్లకు పంపించాల్సి ఉంది. అయితే దరఖాస్తుదారులు వెంటనే ఆధార్ కార్డులు అరగంటలో సమర్పించాలని గ్రేటర్‌లోని ఆర్వీలు ఫోన్లు చేసి ఆదేశిస్తున్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయకుండా ఇంటి వద్ద ఉన్నాం ఆధార్ కార్డులు తీసుకొచ్చి ఇవ్వాలంటూ ఆర్డర్లు వేస్తున్నట్లు పలువురు దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఉర్సు సీఆర్‌సీ సెంటర్‌కు ఆధార్ కార్డులతో వచ్చిన పలువురు దరఖాస్తుదారులు ఆర్వీల కోసం గంటల తరబడి పడిగాపులు పడ్డారు. అయితే మండలాల పరిధిలో సుమారు 500 మందిని ఎంపిక చేసే అవకాశం ఉండగా, గ్రేటర్‌లో మాత్రం స్పష్టత కరువైంది. పలువురు బ్యాంక్ లింకేజీ లేకుండా రూ. 50 వేల లోన్ కోసం దరఖాస్తు చేసుకోగా మిగిలిన వారు రూ. 4 లక్షల వరకు కావాలంటూ అప్లికేషన్ పెట్టుకున్నారు. అయితే లబ్ధిదారులను ఏ పద్ధతిలో ఎంపిక చేస్తారనే దానిపై అధికారులు సమాధానం చెప్పడం లేదు. సిబిల్ స్కోర్ జాబితా వచ్చాకే గ్రేటర్ పరిధిలో కమిషనర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని చెబుతున్నారు.

ఉర్సు సీఆర్‌సీ సెంటర్ వద్ద ఆధార్‌కార్డులతో ఆర్వీల కోసం ఎదురు చూస్తున్న ఆర్‌వైవీ దరఖాస్తుదారులు

CBSE-2025 ఫలితాలలో గ్రీన్‌వుడ్ ప్రభంజనం...